# ఆ రోజులూ - ఈ రోజులు

శ్రీమతి చివుకుల లక్ష్మీ పున్నయ్య

రుక్మిణి చదువుకుండే రోజులలోనే ఠీవిగా నుంటుండేది. ఆమె దృష్టిలో పురుషులు అవకాశవాదులు, స్వార్థపరులు, మర్యాద మన్ననలు తెలియనివారని. ఆమె సాధారణంగా స్కూలులో ఏకొద్దిమందితోనో మాట్లాడేది. పురుషులపట్ల ఆమెకుగల ఏవగింపును చూచి తోడి విద్యార్థులు అనేక విధాలుగా చెప్పుకొనేవారు. ఆమె వాలకం గర్వము, ఠీవిసూచకంగా నుండేవి. ఆమెకు మహిళా ఉద్యమమన్నా, స్త్రీ స్వాతంత్ర్యమన్నా ఆసక్తిమెండు. పురుషులతోబాటు స్త్రీల సమాన హక్కులు, అవకాశములను గురించి స్కూలులో విద్యార్థుల సమావేశాలలో గంభీరంగా ఉపన్యసించేది. స్కూలు ఫైనలు పరీక్ష ప్యాసయి టైపిస్టుగా ఉద్యోగం చేరిన తరువాతకూడ మహిళా ఉద్యమంలో నిర్విరామంగా పని చేస్తుండేది.

రుక్మిణి తల్లిదండ్రులు సామాన్య కుటుంబీకులయినా ఏకైక పుత్రిక, మగసంతానం లేకపోవడం వలన చాల గారాబంగా పెంచి స్కూలు ఫైనలుదాక చదువు చెప్పించారు. ఒక చేతిలో తోలుసంచి, మరొక చేతిలో గొడుగు, కండ్లకు జోడు, కాళ్లకు స్లైక్సు జోడు రుక్మిణిని సంపన్న గృహస్తుని కుమార్తెగా రూపొందించేవి. చేతిలోని సంచిలో పట్టుమని అర్ధరూపాయి చిల్లరడబ్బులులేకపోయినా, యింట్లో పచ్చడి మెతుకులుతిన్నా బయటికివచ్చేటప్పటికి చలవమడతలు చెరగని దుస్తులతో ముస్తాబయి, చెప్పుకోడం తమ యింట్లో పాలు, పండ్లు, క్యాబేజి, కాలీఫ్లవరు, బఠాణి, టమాటోలలాంటి ఆహారపదార్థములుతప్ప యితరము నెరుగనట్లుండేది. కాని పూజపర్వదినాలలో ఆఫీసునందు ప్రసాదమునకు ఎగబడే ధోరణిచూస్తే అరటిపండ్ల ముఖము ఆమె ఏనాడు ఎరుగదేమోననిపించేది.

ఆమెకు దాంపత్య జీవితమంటే గిట్టదు. ఎవరైనా తన పెండ్లిని గురించి ప్రస్తాపిస్తే తాను పెండ్లిచేసికొని పురుషునకు బానిసకావడం ఎన్నటికి జరుగదని రాయి గుద్ది చెప్పేది. ఆమె పెంకెతనాన్ని చూచి వారింటి చుట్టు ప్రక్కలవాళ్లు “పెండ్లిచేసుకోకుండా ఎంత కాలముంటావో చూద్దాం !” అంటుండేవాళ్లు. ఆఫీసులోనయినా తన పనిని వంచిన తల ఎత్తకుండా చేయడం, యింటికి బయలుదేరడమే కాని యితరులతో మాట, మంచి యుండేది కాదు.

ఒకసారి మహిళాసభ వార్షికోత్సవ సమావేశంలో సంఘంలో పురుషులవలన స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను గురించి, పురుషుల దాస్యమునుండి ముక్తినిపొందుటకు స్త్రీలు విద్యావతులై స్వతంత్ర జీవనమున కలవాటుపడవలసిన ఆవశ్యకతను గురించి, స్త్రీ స్వాతంత్ర్యమును గురించి తీవ్రంగా నుపన్యసించింది. కరతాళ ధ్వనుల మధ్య అనేకమంది స్త్రీలు ఆమెను అభినందించారు. సమావేశం ముగియగానే రిక్షాఎక్కి యింటికి బయలుదేరింది.

రాత్రి షుమారు 9 గంటల సమయం. రోడ్డు ప్రక్కన దీపాలు దూరదూరంగా నున్నవి. దీపాల వెలుతురు కాంతివిహీనంగా నున్నది. జనసంచారము, సందడి తగ్గిపోయింది. రిక్షా వడిగా సాగిపోతున్నది. దాని వెనకాల కొంత దూరంలో నలుగురు సైకిళ్లమీద మాట్లాడుతూ వస్తున్నారు. కొంతదూరం పోయేసరికి “రుక్కూ” అని పిలచినట్లు వినబడింది. రుక్మిణి గుండె దడదడలాడింది. అయినా ధైర్యము చిక్కబట్టుకొని వెనక్కు తిరిగి చూచింది. తనతో స్కూలుఫైనలు క్లాసు చదువుకున్న శ్రీధర్ చిరునవ్వుతో “రుక్కూ! యీ రోజున నీవు మహిళాసభలో యిచ్చిన ఉపన్యాసానికి అభినందించ దలచివచ్చాము” అన్నాడు సైకిలును ప్రక్కగా రానిస్తూ. అతని వెంబడే ముగ్గురు స్నేహితులు ముందుకొచ్చి రిక్షాను చుట్టుముట్టారు.

"అభినందించడమేమిటిరా! ఆమెను పెండ్లి చేసుకోదలచివచ్చానని చెప్పరాదూ!" అన్నాడు ఒక స్నేహితుడు.

మరొకడు "ఈ రాక్షసిని చేసికొని వాడేం ఏగ కలుగుతాడురా!" అన్నాడు.

రుక్మిణికి చిరుచెమటలు పట్టినాయి. కండ్లు ఎర్రబడ్డాయి. కోపావేశంతో "షటప్ ఫూల్స్" అని గర్జించి రిక్షాను త్వరగా పోనియ్యమని గదమాయించింది.

రిక్షావాడు "ఇదేమిటి బాబయ్యా! అర్ధరాత్రప్పుడు అంకమ్మ శివాలన్నట్లు ఒంటరిగా పోతున్న ఆడపిల్ల వెంబడి కుక్కలు నక్కలలాగ వెంటబడ్డారు" అంటూ రిక్షాను ముందుకు సాగనిచ్చాడు. స్నేహితులతో శ్రీధర్ మారుమాట్లాడకుండా జారుకున్నాడు.

అప్పటినుండి శ్రీధర్ రుక్మిణి కనుపించినప్పుడల్లా చిరునవ్వు విసిరేవాడు. ఆమెను వర్ణిస్తూ పద్యాలు, పాటలు వ్రాసి పోస్టులో నామెకు పంపేవాడు. ప్రతినిత్యము రుక్మిణిగారి యింటిముందు అటుయిటు చూడ్కులు నిగిడిస్తూ కనీసం అయిదారుసార్లయినా తిరిగేవాడు. అది చూచి ఛీదరించుకున్నవి, తిట్టినవి, కడకు కొట్టబోయిన రోజులుకూడ యున్నవి. కాని శ్రీధర్‌కు మాత్రం రుక్మిణిమీద మోజు తగ్గలేదు.

రుక్మిణి ఎంతపట్టుదలగా తన వివాహమునకు వ్యతిరేకియయినా యీడువచ్చినపిల్ల కావడం వలన తల్లిదండ్రులు పెండ్లిచేయ నిశ్చయించారు. తనకు పెండ్లి వద్దంటే వద్దని మారాంపెట్టి, ఏడ్చి, అఘాయిత్యంచేసింది. కాని తల్లిదండ్రుల నిర్ణయం మారలేదు. పాపం నిస్సహాయరాలైంది. వివాహ ప్రయత్నాలు శరవేగంగా సాగిపోతున్నవి. మరి వరుడెవ్వరో! కనీసం తానొకసారి చూడనైనా లేదేయనుకోసాగింది. పోనీ తనుచూడకపోయినా చేసికొనబోయేవాడైనా తన్నుచూడలేదేమాయని మథనపడసాగింది. ఈ కలవరంతో తిండిమానేసి నిరాశ నిస్పృహలతో రోజులు దొర్లిపోతున్నవి. తీరా ఆ రోజు రానేవచ్చింది. మేళతాళాలతో, పందిట్లో యథావిధిగా వివాహంజరిగింది. కనీసం మంగళ సూత్రం కట్టేటప్పుడైనా వరుడెట్టివాడో చూడసాహసించిందికాదు. మరి పెండ్లిలో కట్నకానుకలంటారు, నడతలంటారు, వేడుకలంటారు— అవేమిలేవు అక్కడ. పెండ్లి క్లుప్తంగా జరిగింది. వంచినతల ఎత్తని రుక్మిణి తనీలోకంలోనున్నట్లే భావించలేదు.

ఆ రాత్రే ఆ నూతనదంపతులను గదిలోకి పంపేశారు. పూర్వాచారపరాయణులు యిదేమి విడ్డూరమమ్మా! అన్నారు. మరి యింకా కొందరు చాదస్తపు ఆడవారు గది కిటికీసందులలోనుండి, తలుపుసందులలోనుండి నక్కినక్కి చూడసాగేసరికి రుక్మిణి తండ్రి గదమాయించాడు. దాంతోటి ఎక్కడి వారక్కడ పడుకొని నిద్రపోయారు.

గదిలోరుక్మిణి తలవంచుకొని నిలుచున్నది ఒక మూల. మంచముపై పరుపుమీద చలవదుప్పటి పరచి దిండ్లు, దుప్పటియున్నవి. మంచము ప్రక్కగా చాపబరచియున్నది. అక్కడే ఒకప్రక్కన చిన్న బల్లమీద వెండిపళ్లెంలో తినుబండారాలు, పండ్లు యున్నవి. అగరువత్తులవాసన ఘుమాయిస్తున్నది.

మంచంమీద కూర్చుంటూ "రుక్కూ!" అన్నాడు యువకుడు.

ఆ పిలుపు తనకేదో పరిచయమున్న కంఠస్వరమనిపించింది రుక్మిణికి; అయినా నిశ్చలంగా నిలబడియుంది. యువకుడు మెల్లగా ఆమె వెనుకకుపోయి జడలోని రోజాపూవులను సవరిస్తూ "రుక్కూ!..." అని పిలచాడు మరల. అది ఆమెకు ఎలెక్ట్రిక్ షాకులాగుండింది. తటత్తి వెనక్కు తిరిగి చూచింది. కళ్లు వికసించినవి. పెదవులమీద చిరునవ్వు చిందింది.

"శ్రీధర్!..." అన్నది

"అవును రుక్కూ! నీకోసం తపించి తపించి చివ

రకు నీ చేత చీవాట్లు... తిని ఎలాగైతేనేం యీనాడు విజయం నాదయింది. మరి యీ విజయం నీది కూడా కదూ!" అన్నాడు శ్రీధర్.

రుక్మిణి కేమనాలో తెలియలేదు. తనది ఓటమని ఆమెహృదయం ఘోషించింది. అయినా యిందులో ఓటమేముంది? అందరు ఆడవాళ్లలాగే కుటుంబ అవకాశాలకు, హక్కులకు సమానభాగస్వామిగా ఆదర్శనీయమగు దాంపత్యమును గడుపుచున్నానుగదా యనుకున్నది.

"ఏమిటి రుక్కూ! ఆలోచిస్తున్నావు! మన ముభయులము ఒకరినొకరము అర్థముచేసికొని సంసార యాత్రసాగిస్తే ఉమ్మడి భాగ్యానికి లోటుండదు. కాని నీ పెంకితనంమాత్రం..." అన్నాడు శ్రీధర్ ఆమెను తన కౌగిలిలోకి తీసికుంటూ.

"మీరు పాపం బహుబుద్ధిమంతులు కాబోలు! ఒంటరిగా చీకట్లో పోతున్న ఆడపిల్ల వెంబడిపడిన పెద్దలు..." అన్నది రుక్మిణి శ్రీధర్ బాహువులలో నలిగిపోతూ. ఆమె పెదవులు అతనికి స్వాగతమిచ్చాయి.

ముగ్గురు పిల్లలతో రుక్మిణి భర్తతో కాపరం చేస్తూ ఎవరైనా "పెళ్లి వద్దు వద్దంటూ ముగ్గురు పిల్లల్ని..." అని నవ్వుతూ అంటే "అవి ఆరోజులు, యివి యీరోజులు" అంటుంటుంది.

—(o)—

# సిరిసిరి మువ్వలు

అమెరికన్ కోటీశ్వరుడు రాక్ ఫెల్లర్ ఒకసారి పెద్ద హోటలుకువెళ్లి సెకండు క్లాస్ గది కావాలని అడిగాడు. హోటలు యజమాని అతనిని గుర్తించి "మీ కుమారుడు యిప్పుడు మా హోటల్లో ఫస్టుక్లాసు గదిలో నుంటున్నాడండీ!" అన్నాడట.

"అవును – వాడి తండ్రి కోటీశ్వరుడు రాక్ ఫెల్లర్. మా తండ్రి కోటీశ్వరుడు కాదాయమరి!" అన్నాడు రాక్ ఫెల్లర్.

◆ ◆ ◆

అనటోల్ ఫ్రాన్స్ తన మిత్రులకు సలహాయిస్తూ "పుస్తకాలు ఎవరికీ ఎరువీయవద్దు. అలా యిచ్చిన పుస్తకాలు మళ్లీ తిరిగిరావు. దీనికి రుజువు కావాలంటే ప్రస్తుతం మా యింట్లోని లైబ్రెరీని చూడండి – అందులోని పుస్తకాలన్నీ నేను స్నేహితుల దగ్గర ఎరువుతీసికున్నవే" నన్నాడు.

◆ ◆ ◆

"మర్యాద అంటే ఏమిటినాన్నా!" అని కొడుకు తండ్రి నడిగాడు.

"మర్యాదంటేనా – నీ యజమాని 'ఏమిటి దీని అర్థం?' అని అడిగేవరకు నీవు నీకున్నదని అనుకునేది" అన్నాడు తండ్రి.

అల్లంకి చెల్లారాం